క్లుప్తంగా

నేడు సామూహిక వ్రతాలు

కందనూలు: ఆషాఢ మాసంగురుపౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజన్ అయ్యంగార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పాల్గొనే భక్తులందరికీ గోత్రనామాలతో సంకల్పం చెప్పనున్నట్లు పేర్కొన్నారు. రామాలయ అన్నప్రసాద కమిటీ వారిచే సామూహిక భోజనాలతో పాటు సత్య సాయి సేవా సమితి, రామాలయ భజన మండలి, రామాలయ మహిళా సభ్యులచే ప్రత్యేకంగా సామూహిక భజన కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. వివరాలకు 9440981253, 9440075238 ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ఆరోపణలు సరికావు

కొల్లాపూర్: ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదని తెలంగాణ దండోరా జిల్లా అధ్యక్షుడు డీకే మాదిగ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 750 మందికి పైగా గిరిజనులకు పోడుభూముల హక్కుల పత్రాలు ఎమ్మెల్యే ఇచ్చారని, నాలుగు దశాబ్దాలుగా ఇళ్ల స్థలాల కోసం పోరాడుతున్న ఎర్రగట్టు బొల్లారం వాసులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని అన్నారు. అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ఎమ్మెల్యేపై దుష్ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్న వారికి సహకారం అందించాలి కానీ, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేయరాదన్నారు. వెంకటస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనీమియా నిర్మూలనపై ర్యాలీ



తాడూరు: అనీమియా నిర్మూలన కార్యక్రమంపై ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శివలీల మాట్లాడారు. పేద ప్రజలకు ప్రభుత్వపరంగా అందించే ఆరోగ్య సేవలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఆస్పత్రికి వివిధ కారణాలతో వచ్చే రోగులపై సానుభూతితో వారికి వైద్యం నిర్వహించి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సంతోష్ అభిరాం, శేఖర్‌గౌడ్, రాజేశ్వరి, గోపి పాల్గొన్నారు.

వీఓఏలకు పనిభారం తగ్గించాలి



వెల్దండ: మహిళా సంఘాలకు అనుబంధంగా పనిచేస్తున్న వీఓఏలకు పనిభారం తగ్గించాలని వీఓఏల సంఘం నాయకులు చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆదివారం మండల వీఓఏల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో 41 రోజుల పాటు గ్రామ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిభారం తగ్గించాలని, కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. జంగమ్మ, మణిపాల్, రామస్వామి, అంజయ్య, వసంత, వనిత, రాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను రక్షించుకోవాలి



వెల్దండ: మొక్కలను నాటి రక్షించుకోవాలని సర్పంచ్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూపతిరెడ్డి హాజరై మొక్కలు నాటారు. వెల్దండ, పెద్దాపూర్, భర్కత్‌పల్లి తదితర గ్రామాల్లో 190 మొక్కలు నాటారు. కార్యక్రమంలో లక్ష్మణ్, భజన మండలి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి కడుపులో కణితి తొలగింపు

నాగర్‌కర్నూల్ క్రైం: వృద్ధురాలి కడుపులో 20కిలోల కణితిని జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆదివారం శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తి మండలం లింగసానిపల్లికి చెందిన 65 ఏళ్ల నాగమ్మ ఏడాది కిందట తీవ్ర కడుపునొప్పితో బాధపడుతుంది. ఎక్కడ చూపినా ఫలితం లేకపోవడంతో జిల్లా కేంద్రంలోని విజయ నర్సింగ్ హోంలో వైద్యులను సంప్రదించారు. వారు స్కానింగ్ చేయడంతో కడుపులో 20 కిలోల కణితి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆస్పత్రి వైద్యుడు డా.రమేష్‌చంద్ర, డా.రాజ్‌కుమార్, డా.రఘు శస్త్ర చికిత్స చేసి వృద్ధురాలి కడుపులో నుంచి కణితిని తొలగించారు. 20 కిలోల కణితి కడుపులో పెరగడం అరుదుగా సంభవిస్తుందని వైద్యులు తెలియజేశారు.

సమస్యలతో సతమతం

- ప్రహరీ లేక విద్యార్థుల్లో విచ్చలవిడి తనం
- బీసీ హాస్టల్‌లో ఏళ్ల తరబడిగా తీరని వ్యథలు
- చిన్న వయస్సులోనే పక్కదారి పడుతున్న పిల్లలు
- పట్టింపులేని అధికారులు, పాలకులు



ఉప్పునుంతల బీసీ హాస్టల్ భవనం

ఉప్పునుంతల: ఒకప్పుడు విద్యార్థులతో నిండుగా ఉండే స్థానిక బీసీ హాస్టల్ ప్రస్తుతం విద్యార్థులు లేక వెలవెలబోతోంది. హాస్టల్‌లో సరిపడ వసతులు లేక విద్యార్థులు సమస్యలతో సతమతమవుతున్నారు. దాంతో విద్యార్థులు హాస్టల్‌లో ఉండటానికి ఇష్టపడటం లేదు. 160 మంది విద్యార్థుల సామర్థ్యం ఉన్న ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 40 మంది మాత్రమే ఉన్నారు. పాఠశాలలు తెరిచి ఇరువై రోజులు కావొస్తున్నా హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెరగడం లేదు. ఇన్‌చార్జ్ వార్డెన్‌లతో ఈ హాస్టల్‌ను నెట్టుకొస్తున్నారు. కొన్నేళ్లుగా నామమాత్రంగా హాస్టల్ కొనసాగుతున్నా.. పాలకులుగానీ, సంబంధిత అధికారులుగానీ ఏమాత్రం పట్టించుకోవడలేదు. సమస్యలతో పాటు విద్యార్థుల క్రమశిక్షణపై శ్రద్ధ చూపే వారు లేకపోవడంతో తమ పిల్లలను హాస్టల్‌లో చదివించడానికి తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. చాలా మంది విద్యార్థులు నిత్యం పరిసర గ్రామాల నుంచి ఉప్పునుంతల జెడ్పీహెచ్‌ఎస్‌కు వచ్చి వెళ్తున్నారే తప్పా.. హాస్టల్‌లో ఉండటానికి ఇష్టపడటంలేదు.



స్నానపు గదులు, మరుగుదొడ్లు ఇలా..

సాగని చదువులు..

దాదాపుగా పదిహేను ఏళ్ల కిందట నిర్మించిన ఈ హాస్టల్ భవనంలో తలుపులు, కిటికీలు సరిగాలేవు. చలికాలంలో విద్యార్థులు కిటికీలకు దుస్తులు అడ్డుగా కడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దాంతో పాటు స్నానపు గదులు, మరుగుదొడ్లకు తలుపులు లేవు. వాటిని శుభ్రం చేసే వారులేక అపరిశుభ్రత నెలకొంది. తరుచుగా శుభ్రం చేయకపోవడంతో సమీపంలోని ఇళ్ల వారు దుర్వాసన తట్టుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- హాస్టల్ చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఉన్న కొద్దిమంది విద్యార్థుల్లో విచ్చలవిడి తనం పెరిగిపోయింది. హాస్టల్‌లో ఉండకుండా బయట తిరగడం, రాత్రిళ్లు గ్రామానికి చెందిన స్నేహితుల ఇళ్లలో ఉండటం వంటివి చేస్తున్నారు. అందుకు ఇటీవల హాస్టల్ విద్యార్థులు గొడవ పడి కత్తిపోట్ల వరకు పరిస్థితి వెళ్లింది. హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులు కనీసం పాఠశాలకు వెళ్తున్నారా. లేదా అనే విషయాన్ని కూడా చూసే వారు కరువయ్యారు.

సమస్యలు పరిష్కరించాలి..

హాస్టల్‌లో సమస్యలు పరిష్కరిస్తే చదువుకోవడానికి మంచి వాతావరణం ఏర్పడుతుంది. చుట్టూ ప్రహరీ లేక పశువులు, మేకలు, పందులు పరిసర ప్రాంతంలో తిరుగుతుంటాయి. ప్రహరీ ఉంటే పాఠశాల నుంచి వచ్చిన తర్వాత గేట్‌కు తాళం వేస్తే బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా ఉంటుంది. బాత్‌రూంలు సరిగా లేవు. హాస్టల్‌లో విద్యార్థులు ఉండటానికి ఇష్టపడటం లేదు.

– భరత్, 10 తరగతి హాస్టల్ విద్యార్థి

పలుమార్లు విన్నవించినా..

హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి, మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరుగుదొడ్లు, బాత్‌రూంలు సరిగా లేకుంటే సొంత డబ్బులతో తాత్కాలికంగా బాగుచేయించాం. ముఖ్యంగా హాస్టల్ చుట్టూ ప్రహరీ లేక ఇబ్బందిగా ఉంది.

– రమేష్, బీసీ హాస్టల్ ఇన్‌చార్జ్ వార్డెన్, ఉప్పునుంతల

సామాన్య ప్రజలపై ధరల పోటు



అచ్చంపేటలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న రోహిణిరెడ్డి

అచ్చంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై ధరల పోటు వేస్తోందని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రోహిణిరెడ్డి అన్నారు. అచ్చంపేట అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రోడ్డుపై గ్యాస్ సిలిండర్‌కు పూలదండలు వేసి పలు రకాల కూరగాయాలతో ప్రదర్శించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ధరలు ఆకాశాన్ని అంటడంతో ప్రజలు కొనలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. గ్యాస్ సిలిండర్, కూరగాయాలు, పప్పు, ఉప్పు నూనెలు, పలు రకాల నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ ఎం.రామనాథం, కౌన్సిలర్ గౌరిశంకర్, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

తాడూరు: ప్రత్యేక తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం అని, తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని టీపీసీసీ సభ్యుడు బాలగౌడ్, మండల అధ్యక్షుడు ఐతోల్ లక్ష్మయ్య అన్నారు. ఆదివారం మండలంలోని యాదిరెడ్డిపల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఖమ్మంలో నిర్వహించే జనగర్జన సభకు నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలను తరలించాలని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ సభ్యులు

బోనాలు సమర్పించిన మహిళలు

దోమలపెంట: ఈగలపెంట గ్రామ పొలిమేరలో నున్న మైసమ్మ దేవతకు ఆదివారం వనమయూరి ప్రాంగణంలోని మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని పాదయాత్ర చేస్తూ.. భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. గ్రామస్తులందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు.



సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేతో ప్రింట్ మీడియా అధ్యక్షులు

కల్వకుర్తి రూరల్: డివిజన్ పరిధిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మండల మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కల్వకుర్తి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటయ్య మండలంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలతో పాటు గృహలక్ష్మి, దళిత జర్నలిస్టులకు దళితబంధు అమలయ్యేలా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్, కార్తీక్, గోవర్ధన్, విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

15 రోజుల్లో మండల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టంలో రూపొందించిన నిబంధనల ప్రకారం నూతనంగా మండలం ఏర్పాటు కావాలంటే ఏడుగురు ఎంపీటీసీలతో పాటు మండల పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాల సర్పంచ్‌లు మండల ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానాలు ఇవ్వాలనే నిబంధన ఉందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. ఆదివారం మండలంలోని రఘుపతిపేటలో గ్రామస్తులు రఘుపతిపేట మండలంపై మాట్లాడారు. రఘుపతిపేటను ఎందుకు మండలంగా చేయడం లేదని ఎమ్మెల్యేతో వాదనకు దిగారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ నిబంధనను అమలు చేస్తే సీఎం వద్దకు వెళ్లి ఒక్క రోజులో మండల ఏర్పాటుకు తాను సిద్ధమని ప్రజలకు వివరించారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే గ్రామాల తీర్మానాలు తీసుకొస్తే మండల ఏర్పాటు ప్రక్రియ పెద్ద సమస్య కాదని గ్రామస్తులకు తెలియజేశారు. వైస్ ఎంపీపీ గోవర్ధన్, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి గుర్తింపు



కండువా కప్పుతున్న ఆచారి

కల్వకుర్తి రూరల్: కష్టపడి పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు బీజేపీ రాష్ట్ర నాయకుడు ఆచారి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో దీపక్ గ్లాస్ యజమాని వెంకటేష్ బీజేపీలో చేరారు. కండువా కప్పి ఆచారి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని పలువురు ప్రముఖులను వారి ఇంటి వద్దకు వెళ్లి కలిశారు. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలతో పాటు ప్రపంచంలోనే ఆదరణ పొందిన దేశ ప్రధాని మోదీ కావడం దేశ ప్రజలందరికి గౌరవకారణమన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కృష్ణగౌడ్, రాఘవేందర్‌గౌడ్, దుర్గా ప్రసాద్, శేఖర్‌రెడ్డి, బాబీదేవ్, నరేష్‌గౌడ్, నరోఎచారి, నిరంజన్ గౌడ్ పాల్గొన్నారు.

సాయిచంద్ మృతి తీరని లోటు



తాడూరులో నివాళి అర్పిస్తున్న నాయికులు



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడూరు: తెలంగాణ గిడ్డంగుల శాఖ చైర్మన్, ఉద్యమ గాయకుడు సాయిచంద్ మృతి తీరనిలోటని దళిత సంఘాల నాయకులు బాలెంకటయ్య, పరమేశ్వర్ తెలిపారు. ఆదివారం మండలంలోని అకునెల్లికుదురులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రత్యేక తెలంగాణలో తనదైన శైలిలో పాటలు పాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో ఆయన చేసిన సేవ ప్రశంసనీయమన్నారు. దళిత సంఘాల నాయకులు వెంకటయ్య, బాలస్వామి, హరి, దిలీప్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కందనూలు: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన మలిదశ ఉద్యమ కెరటం, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ కవి గాయకుడు వేద సాయి చంద్ చిత్రపటానికి ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి దంపతులు ఆదివారం హైదరాబాద్‌లోని సాయిచంద్ ఇంట్లో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడారు. మంచి ఆప్తుడిని కోల్పోయాయని, నా వెన్నంటే ఉన్న సాయిచంద్ ఇక లేరనే వార్తను నమ్మలేకపోతున్నానని చెప్పారు. మర్రి జమున, జక్క రఘునందన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు, సైనికులకు వాసవీక్లబ్ సేవలు



బియ్యం, ఎరువులు అందిస్తున్న రమేశ్ బాబు

కల్వకుర్తి రూరల్: జై జవాన్, జై కిసాన్ నినాదంలో భాగంగా వాసవీక్లబ్ విభాగంలో రైతులకు, సైనికులకు సామాజిక సేవా కార్యక్రమాలు అందించారు. క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేశ్ బాబు దాన్ టూ డస్క్ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు రైతులకు ఉచితంగా ఎరువులు, బియ్యం అందజేశారు. సైనికులకు సన్మానం చేసి నిత్యావసర సరుకులు అందజేశారు. డివిజన్ పరిధిలో 4 వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్ బాబు మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్‌లది ప్రత్యేక పాత్ర అన్నారు. క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కల్మిచర్ల రమేశ్, డివిజన్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవం



గురుపూజోత్సవంలో పూజలు చేస్తున్న భక్తులు

మన్ననూర్: స్వయం సేవక్ సంఘ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురుపూజ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయంలో భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. గురు పౌర్ణమి ప్రత్యేకతను ఉద్దేశించి వక్తలు మాట్లాడారు. జయ సద్గురు వ్యాస మహర్షి జన్మదినాన్ని గురు పౌర్ణమిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. అదేవిధంగా అంధత్వంలో కనిపించని ప్రపంచాన్ని వెలుగులోకి తీసుకొచ్చే మార్గాన్ని తెలియజేయడమే గురుత్వంగా చెప్పుకొంటారని అన్నారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరమణ, నాయకులు శ్రీనివాసులు, శేఖర్, లింగయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెంట్లవెల్లి: మండల పరిధిలోని గోపులాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–96లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు మాట్లాడారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించి, సత్కరించి, వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మాట్లాడారు. మాతో విద్య నేర్చుకుని ఒక్కొక్కరు ఒక్కో స్థాయిలో ఉండడం ఎంతో సంతోషకరంగా ఉందని, ఇక ముందు ఎంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు భాస్కర్ రెడ్డి, హన్మంతు, స్వాములు, విజయభాస్కర్, గోపాల్‌రెడ్డి, బాలపీర్, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధిని వినియోగించుకోవాలి



కల్వకుర్తి రూరల్: సీఎం సహాయనిధి పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు కోరారు. ఆదివారం కల్వకుర్తి మండలం తోటపల్లికి చెందిన అంజిరెడ్డికి మంజూరైన రూ.23,500 సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. సమాజంలోని పేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చారకొండ: మండలంలోని బోయ్యల గుడిసెలుకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ సింగిల్ విండో డైరెక్టర్ కొండపల్లి కృష్ణయ్య(43) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మృతదేహానికి పూలమాలలతో నివాళి అర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి, బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల నాయకులు రూ.10 వేల సాయం అందించారు. వెంకట్ గౌడ్, భీముడు నాయక్, బాల్‌రాం గౌడ్ ఉన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



ఉప్పునుంతల: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన చింతల లక్ష్మీదేవమ్మకు ఆదివారం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేతులమీదుగా రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. లక్ష్మీదేవమ్మ కుమారుడు సైదులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. అతడికి బీఆర్‌ఎస్ సభ్యత్వంతో పాటు ఇన్సూరెన్స్ సదుపాయం ఉండటంతో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం మంజూరైనట్లు ఎంపీటీసీ బూరం మల్లేష్ తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు భగవంతు, సైదులు, శ్రీనివాస్‌యాదవ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సాతాపూర్‌లో..



పెద్దకొత్తపల్లి: సాతాపూర్‌కి చెందిన వెంకటస్వామి యాదవ్‌కు రూ.40 వేల చెక్కు, బక్కయ్యకు రూ.9 వేల సీఎం సహాయనిధి చెక్కులను కొల్లాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుజ్జుల పరమేశ్ పంపిణీ చేశారు.

నాయకుల సంతాపం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని తిలక్ నగర్‌కు చెందిన భాస్కర్‌రెడ్డి(54) గుండె పోటుతో ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ కార్యదర్శిగా ఆయన పనిచేశారు. భాస్కర్‌రెడ్డి మృతదేహానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు ఆచారి తదితరులు నివాళి అర్పించారు.

పోడు భూములకు శ్రీకారం



రాయవరం శివారులో రైతులు సాగు చేసుకుంటున్న పోడుభూములు

లింగాల: మండలంలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులైన లంబాడ, చెంచు, ఎరుకల జాతుల వారు 40 ఏళ్లకు పైగా చేస్తున్న పోడుపోరాటానికి ఫలితం దక్కింది. పలు గ్రామాల్లో అటవీ భూములు సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించాలని గిరిజనులు కోరుతూ వచ్చారు. అటవీ శాఖ, రైతులకు మధ్య కొన్నేళ్ల నుంచి వాగ్వాదం చేసుకుంటుంది. ముఖ్యంగా మండలంలోని రాయవరం శివారులోని సర్వే నంబర్ 83లో 1300కు పైగా ఎకరాల్లో భూమిని గిరిజనులు, గిరిజనేతరులు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గత నెల 30న పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది.

16 గ్రామాల గిరిజనులకు పట్టాలు..

పోడుభూములకు సంబంధించి మండలంలోని 16 గ్రామాలకు సంబంధించిన గిరిజనులను ప్రభుత్వం లబ్ధిదారులుగా గుర్తించింది. మొత్తం 259 మందిని గుర్తించి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి గత నెల 30న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు శ్రీకారం చుట్టారు. మండలంలోని రాయవరంలో 136 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా.. మేడిమల్కలలో 18 మంది, పుల్జాయిపల్లిలో 03, రాంపూర్‌పెంటలో 09, సంగడిగుండాలలో 10, శ్రీరంగాపూర్ 01, ఎర్రపెంటలో 07, వద్దెరాయవరంలో 06, అగర్లపెంటలో 03, అప్పాయపల్లిలో 08, అప్పాపూర్‌పెంటలో 12, బౌరాపురంలో 10, చెన్నంపల్లిలో 05, టీసీ తండాలో 02, ఈర్లపెంటలో 19, లింగాలలో 01, ఎంసీ తండా 03 చొప్పున లబ్ధిదారులను గుర్తించారు.

పారదర్శకత కరువు..

పోడు భూముల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత లేదని రాయవరానికి చెందిన కొంత మంది రైతులు గత నెల 28న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సాగులో లేని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారని, 40 ఏళ్లకు పైగా సాగులో ఉన్న వారిని విస్మరించారని ఆరోపించారు. వాస్తవంగా సాగు చేసుకుంటున్న వారికి మాత్రమే పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. రెవెన్యూ అధికారులతో సమగ్ర విచారణ జరిపించి అర్హులైన వారికి న్యాయం జరిగేలా చూస్తామని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు పట్టాల పంపిణీ సమయంలో రైతులకు భరోసా ఇచ్చారు.

బీసీలకు పట్టాలు ఇవ్వాలి

మండలంలోని క్యాంపురాయవరానికి చెందిన బీసీలు కొన్నేళ్ల నుంచి రెవెన్యూ భూమిని సాగు చేసుకుంటూ ఉండటంతో తమకు కూడా పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చి, సాగు భూములపై హక్కులు కల్పించాలని కోరుతున్నారు.